## క్లుప్తంగా

### కనీలాల్ మృతి బాధాకరం


రవీంద్రకుమార్‌ను పరామర్శిస్తున్న వెంకట్‌రెడ్డి

**దేవరకొండ :** దేవరకొండ మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్ర కుమార్ తండ్రి రమావత్ కనీలాల్ మృతి బాధాకరమని సీపీఐ జాతీయ కమిటీ సభ్యులు, మునుగోడు మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్‌రెడ్డి అన్నారు. శనివారం కనీలాల్ అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందగా ఆదివారం స్వగ్రామమైన దేవరకొండ మండలం రత్యతండాలో అంత్యక్రియలు నిర్వహించారు. సోమవారం పల్లా వెంకట్‌రెడ్డి తండాకు చేరుకొని మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్‌తో పాటు ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు. వెంకట్‌రెడ్డి వెంట పల్లా దేవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

### విద్యుదాఘాతంతో గేదె మృతి

**పెద్దఅడిశర్లపల్లి :** విద్యుదాఘాతంతో గేదె మృతి చెందిన సంఘటన పెద్దఅడిశర్లపల్లి మండల కేంద్రంలో సోమవారం చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన పేర్ల నగేష్ పాడి గేదె సోమవారం వ్యవసాయ పొలంలో మేత మేస్తుండగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. గేదె మృతితో సుమారు రూ.70 వేలు నష్టం వాటిల్లినట్లు తెలిపారు. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు పేర్కొంటున్నాడు.

### ఇరు వర్గాల మధ్య ఘర్షణ

**డిండి :** పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ సందర్భంగా సోమవారం మండల పరిధిలోని దేవత్‌పల్లి తండాల్లో మధ్యాహ్నం వరకు పోలింగ్ సాఫీగా జరిగింది. అనంతరం పోలింగ్ కేంద్రం సమీపంలో ఏ పార్టీకి ఓటు వేశావు అన్న విషయంలో ఇద్దరి వ్యక్తుల మధ్య మొదలైన తగాదా ఇరు వర్గాల మధ్య ఘర్షణకు దారితీసింది. దీంతో పోలీసులు ఇరువర్గాలను చెదరగొడుతున్న సమయంలో అదే తండాకు చెందిన రమావత్ మారి ఓటు వేయడానికి బూత్‌కు వస్తుంది. ఈ క్రమంలో పరుగులు తీస్తున్న పలువురు సదరు మహిళకు తాకడంతో కిందపడి చేతికి గాయమైంది. సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు మారిని దేవరకొండలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ.రాజు సంఘటనా స్థలానికి చేరుకొని ఘటనకు సంబంధించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ ముగిసేంత వరకు తిరిగి పోలింగ్ కేంద్రం వద్ద ఎలాంటి అవంచనీయ ఘటనలు జరగకుండా ఎస్ఐ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

### కేంద్రీయ విద్యాలయంలో వందశాతం ఉత్తీర్ణత


సుహాన్ సమీర్ జాడ్‌దో

**మిర్యాలగూడ టౌన్ :** పట్టణంలోని కేంద్రీయ విద్యాలయం పదోతరగతి సీబీఎస్ఈ ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించిందని ఆ విద్యాలయం ప్రిన్సిపాల్ జి. శ్రీనివాసులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 36మంది విద్యార్థులకు 36మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని పేర్కొన్నారు. ఐదేళ్లగా పాఠశాలలో వంద శాతం ఫలితాలను సాధించి రికార్డును సృష్టిస్తున్నారు. ఈ సీబీఎస్ఈ పదో తరగతి ఫలితాల్లో పాఠశాలకు చెందిన సుహాన్ సమీర్ జాడ్‌దోకు 486/500ల మార్కులతో ప్రథమ స్థానం, పూర్ణ సుమితకు 469/500 మార్కులతో ద్వితీయ స్థానం, పి. సుమిధకు 440/500 మార్కులతో తృతీయ స్థానంలో నిలిచినట్లు తెలిపారు. ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులుతో పాటు ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.

### ఆర్థిక సాయం అందజేత


బాధితుడికి ఆర్థిక సాయం అందిస్తున్న భిక్షాచారి దంపతులు

**పెద్దవూర :** కారు డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్న మండల కేంద్రానికి చెందిన కిలారి చెన్నకేశవులు బ్రెయిన్ ట్యూమర్ వ్యాధితో బాధపడుతున్నాడు. చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఆస్పత్రికి తీసుకెళ్లగా ఆపరేషన్ కోసం రూ.10లక్షలు అవుతుందని డాక్టర్లు చెప్పడంతో చేసేది లేక ఇంటికి తీసుకుని వచ్చారు. ఎవరైనా దాతలు ముందుకు వచ్చి ఆదుకుంటే ఆపరేషన్ చేయించుకోవడానికి వీలు అవుతుంది. ఈ విషయం తెలుసుకున్న మండల కేంద్రానికి చెందిన విశ్వబ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షుడు ఓరోజు బిక్షాచారి-పుష్పలత దంపతులు స్పందించి సోమవారం బాధితుడికి ఇంటికి వెళ్లి రూ.15వేల ఆర్థికసాయం అందించి మానవత్వం చాటుకున్నారు.

# ప్రశాంతంగా ముగిసిన పోలింగ్

- పలు చోట్ల మొరాయించిన ఈవీఎంలు
- అక్కడక్కడ స్వల్ప ఘర్షణలు
- పోలింగ్ సరళిని పరిశీలించిన ఎంపీ అభ్యర్థులు, ఎమ్మెల్యేలు
- పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసిన పోలీస్ శాఖ


దేవరకొండ : తాటికోల్‌లో బారులుదీరిన ఓటర్లు


హాలియా : పోలింగ్ కేంద్రం వద్ద బారులుదీరిన ఓటర్లు

**మిర్యాలగూడ :** మిర్యాలగూడ నియోజకవర్గంలో సోమవారం నిర్వహించిన పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 7- 9గంటల వరకు 12.5శాతం నమోదు కాగా 9-11గంటల మధ్య 29.63శాతం, 11-1 గంటల మధ్య 45.40శాతం, మధ్యాహ్నం 1-3 గంటల వరకు 54.72శాతం, 3-5గంటల వరకు 70.26శాతం పోలింగ్ నమోదైంది. సాయంత్రం 5గంటల తరువాత కూడా కొన్ని పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు బారులుదీరారు. నియోజకవర్గంలో 2,36,343 మంది ఓటర్లు ఉండగా 1,66,045 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మిర్యాలగూడ నియోజకవర్గ వ్యాప్తంగా 73.29శాతంగా నమోదైంది. కాగా మిర్యాలగూడ మండలం జేత్యాతండాలో సిబ్బంది అవగాహన లోపంతో ఈవీఎం ప్రారంభం కాక అరగంట సేపు పోలింగ్ నిలిచింది. సమాచారం అందుకున్న సెక్టోరియల్ అధికారి పోలింగ్‌ను ప్రారంభించారు. నియోజకవర్గ వ్యాప్తంగా పోలింగ్ సజావుగా జరిగేలా అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద డీఎస్పీ రాజశేఖర్ రాజు ఆధ్వర్యంలో సీఐలు, ఎస్ఐలు, కేంద్ర బలగాలతో పటిష్ట బందోబస్తు నిర్వహించి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పర్యవేక్షించారు.

**మాడుగులపల్లి :** మండల వ్యాప్తంగా లోక్‌సభ ఎన్నికల పోలింగ్ సోమవారం ప్రశాంతంగా ముగిసింది. ఉదయం నుంచే ఓటు వేసేందుకు ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్ద బారులుదీరారు. 80.5 పోలింగ్ శాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. మండల కేంద్రంలోని 245 పోలింగ్ బూత్, తోపుచర్లలోని పోలింగ్ బూతుల్లో ఉదయం 7గంటల తరువాత ఈవీఎంలు మొరాయించడంతో సాంకేతిక నిపుణులు వచ్చి సరిచేశారు. దీంతో పోలింగ్ అరగంట ఆలస్యమైంది. సీత్యాతండా పోలింగ్ కేంద్రం వద్ద ఓ వ్యక్తి గొడవకు దిగడంతో కాసేపు ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు వారికి సర్దిచెప్పి పంపడంతో విషయం సర్దుమనిగింది.

**అడవిదేవులపల్లి :** నల్లగొండ లోక్‌సభ ఎన్నికల పోలింగ్ అడవిదేవులపల్లి మండలంలో ప్రశాంతంగా ముగిసింది. మండలంలో మొత్తం 14 వేల 394 మంది ఓటర్లు ఉండగా 10 వేల 657 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. దీంతో మండలంలో 74.03 శాతం పోలింగ్ నమోదైనట్లు మండల తహసీల్దార్ శ్రీరాం సురేశ్‌కుమార్ తెలిపారు.

**సాగర్ నియోజకవర్గంలో..**

**హాలియా :** నాగార్జున సాగర్ నియోజకవర్గంలో స్వల్ప సంఘటనలు మినహా సోమవారం నిర్వహించిన లోక్ సభ ఎన్నికలు ప్రశాంతగా జరిగాయి. లోక్‌సభ ఎన్నికలు ఉదయం ఏడు గంటలకు ప్రారంభం కాగా 8 గంటల నుంచే ఓటర్లు పోలింగ్ కేంద్రాల్లో బారులుతీరారు.సాయంత్రం ఆరు గంటలలోపు పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న వారందరినీ ఓటు వేసేందుకు అధికారులు అనుమతించారు. సాగర్ నియోజకవర్గ వ్యాప్తంగా మొత్తం 2,36,484 మంది ఓటర్ల ఉండగా అందులో 1,15,852 మంది పురు షులు, 1,20,611 మంది స్త్రీలు, 21 మంది ట్రాన్స్ జెండర్లు ఉన్నారు. లోక్ సభ ఎన్నికల్లో నియోజకవర్గ వ్యాప్తంగా 74.4 శాతం పోలింగ్ నమోదు అయ్యింది. సాగర్ నియోజకవర్గ పరిధిలోని హాలియా పట్టణంలో 162 పోలింగ్ బూత్‌లో ఈవీఎం మొరాయించడంతో కొద్ది సేపు పోలింగ్ ఆలస్యం అయ్యింది. ఆ తరువాత ఎన్నికల సిబ్బంది ఈవీఎంను మార్చి కొత్త ఈవీఎంను ఏర్పాటు చేయడం వల్ల పోలింగ్ యథావిధిగా కొనసాగింది. పెద్దవూర మండలంలోని రామన్నగూడెంలో 81పోలింగ్ బూత్‌లో ఈవీఎం మొరాయించడం వల్ల 20 నిమిషాల పాటు పోలింగ్ ఆలస్యం అయింది. నిడమనూరు మండలంలోని బంకాపురం గ్రామంలో 87పోలింగ్ బూత్‌లో ఈవీఎం మొరాయించడంతో అరగంట ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైంది.

**తిరుమలగిరి(నాగార్జునసాగర్):** పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ మండ ల వ్యాప్తంగా ప్రశాంతంగా ముగిసింది. పోలింగ్ కేంద్రాలకు ఓటర్లు ఉదయం ఏడు గంటల నుంచే భారులు తీరారు. ఎండ వేడి కూడా ఎక్కువగా లేకపోవడంతో ప్రజలు ఓటు వేసేందుకు ఆసక్తి కనబర్చారు. మండలంలో ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది.

**త్రిపురారం :** మండలంలో లోక్‌సభ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఉదయం 11 గంటల తరువాత పలు పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ మందకొడిగా సాగింది. మండలంలోని, బాబుసాయిపేట, పెద్ద దేవుల పల్లి గ్రామల్లో పోలింగ్ కేంద్రాల వద్దకు మాజీ మంత్రి కుందూరు జానా రెడ్డి, త్రిపురారంలో పోలింగ్ బూత్‌లను నాగార్జున సాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ యాదవ్‌లు పరిశీలించారు.

**నిడమనూరు :** మండలంలో సోమవారం నాడు పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. లోక్‌సభ ఎన్నికల్లో ఓటర్లు తమ ఓటు హక్కును ప్రశాంత వాతావరణంలో వినియోగించుకున్నారు. . మండలంలోని బంకాపురంలో 87 పోలింగ్ బూత్‌లో ఈవీఎం మొరాయించడంతో అర్ధగంట ఆలస్యంగా పోలింగ్ మొదలైంది. మండలంలో బీఆర్‌ఎస్ కు పడాల్సిన ఓట్లు బీజేపీకి క్రాస్ అయ్యాయి. యువత ఓట్లు బీజేపీకి అంటూ క్రాస్ ఓటింగ్ చేశారు. మండలంలోని శాఖాపురంలో ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన మాజీ స్థానిక ప్రజాప్రతినిధి కారుకు వేయమని పోలింగ్ బూత్ వద్ద చెప్పడాన్ని కాంగ్రెస్ నాయకులు గమనించారు.

**పెద్దవూర :** మండలంలో సోమవారం జరిగిన పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఎండలు ఎక్కువగా ఉండటంతో ఓటర్లు ఉదయం, సాయంత్రం సమయంలో ఎక్కువగా ఓటు వేశారు. పిన్నవూరలో మాజీ ఎమ్మెల్సీ తేరా చిన్నపురెడ్డి, పెద్దవూరలో మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, పులిచర్లలో బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు కంకణాల శ్రీధర్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ కంకణాల నివేదితారెడ్డిలు కుటుంబసమేతంగా ఓటు హక్కును వినియోగించుకున్నారు. మధ్యాహ్న సమయంలో పోలింగ్ కేంద్రాలు ఓటర్లు లేక బోసిపోయాయి.

**దేవరకొండ నియోజకవర్గంలో..**

**దేవరకొండ :** నియోజకవర్గంలో సోమవారం పార్లమెంట్ ఎన్నికలు చెదురుమొదురు ఘనటలు మినహా ప్రశాంతంగా ముగిశాయి.దేవరకొండ నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,62,480 ఉన్నారు. వీరిలో మహిళలు 1,30,624 ఉండగా పురుషులు 1,31,834,ఇతరులు 18 మంది ఉన్నారు.ఇందుకు గాను అధికారులు 328 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 5:30గంటల నుండి 7గంటల వరకు మాక్ పోలింగ్ నిర్వహించారు.చింతపల్లి మండలం కుర్మేడులో గల పీఎస్ నెం.11లో వివి ప్యాట్‌లో సమస్య తలెత్తడంతో వెంటనే అధికారులు స్పందించి సమస్య పరిష్కరించడంతో పోలింగ్ ప్రక్రియ ప్రారంభమైంది.సోమవారం ఉదయం కొంత మేర వాతావరణం చల్లబడడంతో పోలింగ్ ప్రక్రియ ఊపందుకుంది.తిరిగి మధ్యాహ్నం మందకొడిగా సాగిన పోలింగ్ సాయంత్రానికి పుంజుకుంది.ఓటర్లు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకునేందుకు గాను పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. నియోజకవర్గ పరిధిలో 94వేల 228మంది పురుషులు ఓటు హక్కు వినియోగించుకోగా 90వేల 163మంది మహిళలు ఓటు వేశారు.దీంతో 70.25శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు తెలిపారు.నియోజకవర్గ పరిధిలోని కొన్ని పోలింగ్ కేంద్రాల్లో నిబంధనల మేరకు సాయంత్రం 6లోపు ఉన్న వారికి ఓటు వేసే అవకాశం కల్పించారు.

**పెద్దఅడిశర్లపల్లి :** పెద్దఅడిశర్లపల్లి మండలంలో మొత్తం 55పోలింగ్ కేంద్రాల్లో 39381 మంది ఓటర్లు ఉండగా 28723 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండలంలో సుమారు 73 శాతం మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉదయం పోలింగ్ సరళి వేగంగా ఉండగా మధ్యాహ్నం తగ్గుతూ వచ్చింది మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రంను జిల్లా అడిషినల్ ఎస్పీ రాములు నాయక్ పరిశీలించగా, బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి, మండలంలోని బాలాజీనగర్ పోలింగ్ కేంద్రాన్ని దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్ సందర్శించి పోలింగ్ సరళిని తెలుసుకున్నారు. గుడిపల్లి ఎస్ఐ నర్సింహులు ఆధ్వర్యంలో భారీ బందోబస్తు నిర్వహించి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకున్నారు.

**చింతపల్లి :** చింతపల్లి మండలంలో పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ సోమవారం ప్రశాంతంగా ముగిసింది. 57 బూతుల్లో 78.60శాతం పోలింగ్ శాతం నమోదు కాగా మండలంలో మొత్తం 43,774 ఓట్లకు గాను 32,591 ఓట్లు పోలైనట్లు అధికారులు తెలిపారు. దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్ మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి హోమంతాలపల్లి బూత్‌ను పరిశీలించారు. ఏఎస్పీ రాములునాయక్ మండలంలో పలు పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. ఎలాంటి అంవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలింగ్ ప్రశాంత వాతావరణంలో ముగిసింది.

**రేకులగడ్డలో మొరాయించిన ఈవీఎం**

**చందంపేట :** చందంపేట మండలంలోని రేకులగడ్డలోని పోలింగ్ కేంద్రంలో ఈవీఎం మొరాయించడంతో ఉదయం 7 గంటలకు ప్రారంభం కావాలిసిన పోలింగ్ 11 గంటలకు ఆలస్యంగా ప్రారంభమైంది. ఈవీఎం మొరాయించడంతో అధికారులు మరొక ఈవీఎంను అందుబాటులోకి తీసుకురావడంతో పోలింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. బీఆర్‌ఎస్ నల్లగొండ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి సోమవారం చందంపేటలోని పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించి ఓటింగ్ సరళిని తెలుసుకున్నారు.

**డిండి :** పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. మండలంలో మొత్తం 41632 ఓటర్లకు గాను మండలంలో ఏర్పాటు చేసిన 52 పోలింగ్ కేంద్రాల్లో 29558 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండలంలో మొత్తం 71 శాతం పోలింగ్ నమోదైంది. మండల పరిధిలో 38 గ్రామపంచాయిలుండగా వీరబోయనపల్లి గ్రామపంచాయితీలో కాంగ్రెస్ పార్టీకి తప్ప మిగతా పార్టీలకు పోలింగ్ కేంద్రంలో ఏజెంట్‌లు కరువయ్యారు. మండల కేంద్రంలోని 142 పోలింగ్ కేంద్రంలో పురుషులకన్న అత్యధికంగా మహిళ ఓటర్లు అధికంగా ఉండటంతో అధికారులు మహిళ పోలింగ్ కేంద్రంగా ప్రకటించారు. దీంతో సోమవారం సంబందితాధికారులాదేశాల మేరకు డిండి ప్రత్యేకాధికారి, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ డ్యానియల్ తమ సిబ్బందితో మహిళ పోలింగ్ కేంద్రాన్ని పూల మాలలు, కొబ్బరి ఆకులతో అలంకరించారు.

**ఓటు హక్కును వినియోగించుకున్న ట్రాన్స్‌జెండర్**

**మిర్యాలగూడ టౌన్ :** మిర్యాలగూడ నియోజకవర్గంలో 33మంది ట్రాన్స్ జెండర్ ఉండగా వీరిలో సోమవారం నల్లగొండ లోక్‌సభ ఎన్నికల్లో 20 మంది ఓటు హక్కు వినియోగించుకున్నట్లు స్త్రీ,శిశు సంక్షేమ, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ నోడల్ అధికారి మమత తెలిపారు.

**త్రిపురారం :** మండల కేంద్రానికి చెందిన ట్రాన్స్ జెండర్ కొండేటి రవి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 272వ పోలింగ్ కేంద్రంలో సోమవారం ఓటు వేసి వినియోగించుకున్నారు. ఓటు అనేది మనకు ఉన్న హక్కు అని, ఓటు వేయడం సంతోషంగా ఉందన్నారు.


మాడుగులపల్లి : తోపుచర్లలో బారులుదీరిన ఓటర్లు


మిర్యాలగూడ టౌన్ : ఓటు హక్కును వినియోగించుకుంటున్న ట్రాన్స్‌జెండర్స్


తిరుమలగిరి : ఓటు హక్కును వినియోగించుకున్న యువత


మిర్యాలగూడ : జంకుతండాలో క్యూలో నిల్చున్న ఓటర్లు


మిర్యాలగూడ : పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి


దేవరకొండ : బాలికల కళాశాలలోని పోలింగ్ బూత్ వద్ద..


చందంపేటలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి


పెద్దవూరలో..


పెద్దవూర: తమ్మడపల్లిలో 11 గంటలకు ఓటర్లు లేక ఖాళీగా ఉన్న పోలింగ్ కేంద్రం


పెద్దవూర : మొదటి సారి ఓటు వేసిన యువతి


ఓటు వేసిన బీఎస్‌పీ ఎంపీ అభ్యర్థి అంజయ్య


మిర్యాలగూడలో ఓటు వేసిన మిట్టపల్లి వెంకటేష్


పెద్దఅడిశర్లపల్లి : ఓటు వేసిన అలుగుబెల్లి శోభారాణిఏవిరెడ్డి


దేవరకొండ : తాటికోల్‌లో పోలింగ్ కేంద్రానికి వృద్ధుడిని తీసుకొస్తున్న సిబ్బంది


తిరుమలగిరి : చిల్యాపురంలో వృద్ధురాలిని వీల్‌చైర్‌లో తీసుకువస్తున్న సిబ్బంది


కొండమల్లేపల్లి : 111వ పోలింగ్ బూత్ వద్ద బారులుదీరిన ఓటర్లు


నిడమనూరు: రాజన్నగూడెంలో మహిళా పోలింగ్ బూత్‌లో బారులుదీరిన ఓటర్లు


చింతపల్లి : ఓటు హక్కు వినియోగించుకున్న యువకులు


దామరచర్ల మండలం కేతావత్ తండాలో ఓటు హక్కు వినియోగించుకున్న డీసీసీ అధ్యక్షుడు


తిపురారం : పోలింగ్ సరళిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి


త్రిపురారం : పెద్దదేవులపల్లిలో ఓటింగ్ శాతాన్ని అడిగి తెలుసుకుంటున్న మాజీ మంత్రి జానారెడ్డి

## ఓటు హక్కు వినియోగించుకున్న ప్రముఖులు


పెద్దవూర: పిన్నవూరలో ఓటు హక్కు వినియోగించుకున్న మాజీ ఎమ్మెల్సీ చిన్నపురెడ్డి


పెద్దవూర: పులిచర్లలో ఓటు హక్కు వినియోగించుకున్న శ్రీధర్‌రెడ్డి, కుటుంబసభ్యులు


దేవరకొండ : పద్మట్‌పల్లిలో ఓటు వేసిన సీపీఐ జాతీయ కమిటీ సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి

**మిర్యాలగూడ :** ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి సోమవారం పట్టణంలోని హౌసింగ్‌బోర్డులోగల 46వ బూత్‌లో తన కుటుంబసమేతంగా ఓటు హక్కు వినియోగించుకున్నారు. పట్టణంలోని డౌహిల్ స్కూల్‌లో కుటుంబసమేతంగా ఓటును వేశారు.

**నాగార్జునసాగర్ :** నందికొండ మున్సిపాలిటీలోని హిల్‌కాలనీలోని జూనియర్ కళాశాలలోని పోలింగ్ బూత్‌లో మాజీ మంత్రి జానారెడ్డి కుటుంబ సభ్యులు ఓటేశారు. జానారెడ్డి సతీమణి సుమతి, ఆయన పెద్దకుమారుడు పార్లమెంట్ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డి ఆయన సతీమణి,జానారెడ్డి చిన్న కోడలు ఒకే సారి వచ్చి ఓటేశారు.

**తిరుమలగిరి(సాగర్) :** ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి ఆయన సొంత గ్రామమైన బోయగూడెంలో కుటుంబంతో వచ్చి ఓటు హక్కును వినియోగించుకున్నారు.

**దేవరకొండ :** ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ కుటుంబ సభ్యులతో కలిసి దేవరకొండ మండల పరిధిలోని కమలాపూర్‌లో ఓటు హక్కు వినియోగించుకోగా మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ దేవరకొండ మండలం రత్యతండాలో కుటుంబ సభ్యులతో కలిసి ఓటు వేశారు.సీపీఐ జాతీయ కమిటీ సభ్యులు పల్లా వెంకట్‌రెడ్డి పద్మట్‌పల్లిలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. మండల కేంద్రంలో నల్లగొండ బీఎస్‌పీ ఎంపీ అభ్యర్థి విరిగినేని అంజయ్య ఓటు హక్కును వినియోగించుకున్నారు

## పోలింగ్ సరళిని పరిశీలించిన అబ్జర్వర్


మిర్యాలగూడ : ఆదర్శ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎన్నికల అబ్జర్వర్


పెద్దఅడిశర్లపల్లి : పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అడిషనల్ ఎస్పీ రాములునాయక్

**మిర్యాలగూడ :** పట్టణంలోని పలు పోలింగ్ బూత్‌లను సోమవారం ఎన్నికల అబ్జర్వర్ మనోజ్‌కుమార్‌మాణిక్‌రావు సూర్యవంశీ పరిశీలించారు. పోలింగ్ సరళిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్డీఓ శ్రీనివాస్‌రావు, తహసీల్దార్లు, ఆర్‌ఐలు ఉన్నారు.

**దేవరకొండ :** పట్టణంలోని పలు పోలింగ్ కేంద్రాలను జిల్లా పోలీస్ అబ్జర్వర్ పరిశీలించారు. ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద ఎన్నికల సంఘం నిబంధనలు, సిబ్బంది విధుల నిర్వహణ వంటి అంశాలను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులకు సూచించారు. దేవరకొండ నియోజకవర్గంలో ఎన్నికల సందర్భంగా నలుగురు డీఎస్పీలు, 10మంది సీఐలు, 20మంది ఎస్‌లతో పాటు 650మంది పోలీసులు ఎన్నికల విధుల్లో పాల్గొన్నట్లు దేవరకొండ డీఎస్పీ గిరిబాబు తెలిపారు.